క్లుప్తంగా

శరవేగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం



నిర్మాణంలో ఓవర్‌హెడ్ ట్యాంకు

మద్దికెర: మండల కేంద్రంలోని గుంతకల్లు రహదారిలోని జగనన్నకాలనీలో నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం రూ.50 లక్షలతో చేపట్టిన 60 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలతో పాటు ఇంటి నిర్మాణం చేసుకోడానికి సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నారన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలోపు ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి ఇంటింటికీ కొళాయి సౌకర్యం కల్పించేందుకు చకాచకా పనులు చేస్తున్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో నమోదు చేసుకోండి

మద్దికెర: ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' రాష్ట్ర వ్యాప్త క్రీడాపోటీలను ప్రారంభించిందని, 15 ఏళ్లు దాటిన బాలబాలికలు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. ఆసక్తి గల వారు WWW.aadudamandhra.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతి ఒక్కరూ ఆంధ్రా టోర్నమెంటులో పాల్గొనేందుకు అర్హులన్నారు.


భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

ఆస్పరి: తమకు ప్రభుత్వం ఇచ్చిన భూములను ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆస్పరికి చెందిన శేఖర్ సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆస్పరికి చెందిన 13 మందికి మండలంలోని ముత్తుకూరు గ్రామ సమీపంలో సర్వే నంబర్ 4లో భూములు ఇచ్చిందన్నారు. అయితే ఇంతవరకు భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నట్లు వాపోయారు. ఇప్పటికైనా తమ భూములను ఆన్‌లైన్లో నమోదు చేసి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

రూ.2 కోట్లతో సీసీ రోడ్లు

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు సోమవారం తెలిపారు. రూ.1.60 కోట్లు సచివాలయ నిధులు, రూ.60 లక్షలు ఉపాధి నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. మద్దికెరలో అభివృద్ధి పనుల నిమిత్తం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అడిగిన వెంటనే నిధులు విడుదల చేయడం సంతోషకరమన్నారు. త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు.

బైక్ చక్రంలో బుర్కా పడి ప్రమాదం



ప్రమాదంలో గాయపడ్డ ముంతాజ్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బోడబండ గ్రామ సమీపంలో సోమవారం ఆదోని వైపు బైక్‌పై వెళ్తున్న నజీర్, ముంతాజ్, సీజ (6 నెలల) ప్రమాదంలో గాయపడ్డారు. పెద్దకడబూరుకు చెందిన నజీర్, ముంతాజ్ ఎమ్మిగనూరుకు వెళ్లి పనిముగించుకొని ఆదోని వైపు బైక్‌పై వెళ్తున్నారు. బోడబండ గ్రామ సమీపంలో బైక్ వెనుక చక్రంలోకి ముంతాజ్ ధరించిన బుర్కా పడి చిక్కుకుపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో నజీర్, ముంతాజ్‌తో పాటు 6 నెలల సీజ అనే చిన్నారి గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టెంకాయలో రెండు కాయలు



ఒక టెంకాయలో దర్శనమిస్తున్న రెండు కాయలు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామంలోని శ్రావణి, రామాంజినేయులు దంపతులు సోమవారం నిర్వహించిన గౌరీనోముల పూజల్లో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి టెంకాయ కొట్టగా లోపల రెండు కాయలు దర్శనమిచ్చాయి. ఇలా రావడం తమకు అదృష్టమని, సిరిసంపదలు కలిసొచ్చి నట్లవుతుందని ఆ కుటుంబ సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారు.



గురజాల నది తీరంలో పుణ్యస్నానాలు చేసి దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తుంగభద్ర నది తీరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గురజాల ఆలయ పునరుద్ధరణకు రూ.2 లక్షల విరాళం అందిస్తున్న భక్తులు



ఆస్పరిలో సాయిబాబా రూపంలో ముగ్గు వేసి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక దీపం.. దివ్య తేజం

నందవరం: ప్రముఖ శైవ క్షేత్రం, దక్షిణ కాశీగా పేరు గాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. సోమవారం ఉదయం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఆదిదంపతులకు పురోహితులు హంపేష్ స్వామి జలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, నమక చమక పూజలు గావించారు. భక్తులు తుంగా తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి ఇసుకతో శివలింగాలు చేసి పూజలు చేపట్టారు. కార్తీక దీపాలు వెలిగించి నదీ తల్లికి అర్పించారు. సాయంత్రం పురోహితుల నేతృత్వంలో తుంగభద్రమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి తుంగా హారతిని కానిచ్చారు. ఉత్సవమూర్తులు ఆదిదంపతుల పల్లకోత్సవం నిర్వహించారు. ఆలయంలో జ్వాలా తోరణం వెలిగించారు. భక్తులు ఆలయ ప్రాగణంలో ఉసిరి వృక్షం చుట్టు దీపాలు వెలిగించి ప్రదక్షణలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ గావించారు.

ఆలయ పునరుద్ధరణకు రూ.2 లక్షల విరాళం

గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణకు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన తిరుమల రెడ్డి దంపతులు రూ.2 లక్షల చెక్కును ఆలయ చైర్మన్ పెద్ద నరసింహులుకు అందజేశారు. దాతలకు స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఉరుకుందప్ప, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని జొహరాపురం గ్రామంలో సోమవారం గౌరీనోముల పండుగ సందర్భంగా లక్ష్మీనరసింహా స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల జయ జయ ధ్వనుల మధ్య ఆలయం నుంచి ఊరి చివర వరకు రథాన్ని లాగారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



జొహరాపురంలో లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం



హొళగుంద సాయినాథుని ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఆలూరు భీమలింగేశ్వర స్వామి ఆలయంలో శివలింగం ఆకారంలో దీపాలు వెలిగించిన భక్తులు



దేవనకొండ: ఓంకారం రూపంలో దీపాలు వెలిగించిన భక్తులు



మద్దికెర: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నేడు కార్యాలయాల ప్రారంభోత్సవం



పెద్దకొత్తిలిలో నిర్మాణం పూర్తయిన సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు

నందవరం: మండలంలోని పెద్దకొత్తిలి గ్రామంలో నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను మంగళవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు సోమవారం పీఆర్ ఏఈ జయన్న ఆధ్వర్యంలో ఎంపీడీఓ దశరథ రామయ్య భవనాలను పరిశీలించారు. యన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభోత్సవం ఉంటుందని వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు మండల మీట్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జరగాల్సిన పనులతో పాటు అజెండాలోని అంశాల గురించి చర్చిస్తామన్నారు. అలాగే ఆయా శాఖల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

పత్తికొండ రూరల్: పత్తికొండ మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కవిత తెలిపారు. మండల ప్రజాప్రతినిధులతో పాటు, అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు,.

వేధింపులతోనే వివాహిత ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామ వివాహిత లలిత (21) ఆదివారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తండ్రి దేవనకొండ మండలం బేతెపల్లికి చెందిన హనుమంతరెడ్డి సోమవారం వెల్దుర్తి పోలీసులకు చేసిన ఫిర్యాదులో.. తన కుమార్తె ఆత్మహత్యకు కలుగొట్లకు చెందిన పింజరి షేక్షావలి వేధింపులే కారణమని పేర్కొన్నాడు. రెండేళ్లుగా తన కుమార్తెను వేధిస్తూ మాయమాటలు చెప్పి ఈనెల 24న ఆటోలో తీసుకెళ్లాడని, 26న ఓర్వకల్ మండలంలో వదిలివెళ్లాడని తెలిపారు. తర్వాత కుమార్తె తనకు ఫోన్ చేసి షేక్షావలి చేసిన మోసాన్ని చెప్పి ఆత్మహత్య చేసుకోవాలని ఉందని చెప్పిందన్నారు. అనంతరం భర్త పుల్లగుమ్మిలోని ఇంటికి తీసుకెళ్లాక మానసిక వేదనతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నాడు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి వివాహిత మృతదేహాన్ని వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. నిందితుడు షేక్షావలిపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అశ్లీల వీడియోలతో బెంబేలు!

- ఎమ్మిగనూరు పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు

ఎమ్మిగనూరురూరల్: అపరిచిత వ్యక్తుల నుంచి మీ సెల్‌ఫోన్‌కు వీడియో కాల్ వచ్చిందా... లిఫ్ట్ చేశారా అంతే.. అశ్లీల వీడియోలు ప్రత్యక్షమవుతాయి. బెంబేలెత్తడం మీ వంతు అవుతుంది. ఇలాంటి ఘటనలు ఇటీవల ఎమ్మిగనూరు పట్టణంలో చోటు చేసుకున్నాయి. ఈ విషయాన్ని ఇంట్లో చెప్పుకోలేక మహిళలు కుమిలిపోతున్నారు. ధైర్యం చేసిన ఓ మహిళ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వీడియో కాల్ వచ్చినప్పుడు ఇంట్లో పిల్లలు లిఫ్ట్ చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందని భయంతో వచ్చినట్లు ఆ మహిళ చెబుతున్నారు. ఈ విషయంపై పట్టణ సీఐ మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. తమకు ఫిర్యాదు వచ్చిందని, అయితే ఆ నంబర్ లోకేషన్ చూస్తే అనంతపురం జిల్లా చూపిస్తోందని, విచారణ జరుపుతున్నామన్నారు. కేసు నమోదు చేయలేదని చెప్పారు.

జగనన్నతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



పార్టీ నాయకులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభించనున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆమె సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురించి, అమలు చేయాల్సిన పద్ధతులను వివరించారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డు, సచివాలయ పరిధిలోని గ్రామాలలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించి, తమ మేనిఫెస్టో అమలు తీరుపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలన్నారు. గ్రామంలో అందరు నాయకులు కలిసికట్టుగా సాగేలా చూడాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జ్, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని ముందుండి కొనసాగించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో తాను సైతం పాలు పంచుకుంటానన్నారు. షెడ్యూల్ ప్రకారం గోవర్ధనగిరి-1 సచివాలయ పరిధిలో 28న, చెరుకులపాడు, గోవర్ధనగిరి-2లలో 29న కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.అలాగే 30వ తేదీ కలుగొట్ల-1, డిసెంబర్ 1న కలుగొట్ల-2లో, 2వ తేదీ లక్ష్మీనగరంలో, 4న మదార్‌పురం(సూదేపల్లె), 5న మల్లెపల్లె, 6న నర్సాపురం, 7న పుల్లగుమ్మి, 8న రామళ్లకోట, 9న రత్నపల్లె, 11న శ్రీరంగాపురం, 12, 13, 14 తేదీల్లో వరుసగా వెల్దుర్తి - 1, 2, 3 సచివాలయాల పరిధిలో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి సంబంధించిన సామగ్రి అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, పార్టీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, వివిధ గ్రామాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి పెట్టండి



మంత్రి గుమ్మనూరు జయరాంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఐ ఓబులేసు

ఆలూరు: పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటూ రాత్రివేళల్లో గస్తీ చేపట్టడం ద్వారా నేరాలను నియంత్రించాలని, అలాగే అల్లరిమూకలు, ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశించారు. ఆలూరు పోలీసు స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్ఐ ఓబులేసు సోమవారం స్థానిక మంత్రి నివాసంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. గత నెలరోజుల నుంచి ఇక్కడ పనిచేసిన ఎస్ఐ డాక్టర్ నాయక్ వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వెళ్లిన విషయం విధితమే. అయితే నంద్యాల జిల్లా నందికోట్కూర్ సర్కిల్ పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు నుంచి ఇక్కడికి వచ్చి ఓబులేసు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని మంత్రి సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న తెర్నేకల్ సురేందర్‌రెడ్డి

దేవనకొండ: మండల కేంద్రంలో సోమవారం రంగమ్మకు చెందిన గుడిసెకు నిప్పంటుకుని పూర్తిగా కాలిపోవడంతో కుటుంబసభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా జేసీఎస్ కన్వీనర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి దేవనకొండకు చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీటీసీలు, తపాల శ్రీను, టోపీ యూసుఫ్, మహేష్ వెంట ఉన్నారు.

దేవనకొండ: మండల కేంద్రంలో దళిత రామాంజనేయులు అనే వ్యక్తికి చెందిన గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎఫ్ఆర్ హైస్కూల్ విద్యాసంస్థలు ఆ కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.5 వేలు అందించారు. హెచ్ఎం బి.ఉచ్చీరప్ప, కరెస్పాండెంట్ పి.రఘునాథ్ ఈ నగదును రామాంజనేయులుకు అందజేశారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల: మండలంలో సాగుచేసిన కంది, మిరప, మొక్కజొన్న పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత రైతులకు సూచించారు. వారు సోమవారం గోనెగండ్లలో పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. కంది పంట ప్రస్తుతం పూత దశలో ఉందని, గూడు పురుగు ఆశించినట్లు గమనించామన్నారు. ఈ పురుగు నివారణకు హిమామెక్టిన్ బెంజాయిట్ 0.3 గ్రాములు 1 లీటర్ నీటిని కలుపుకొని 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే నగ పచ్చపురుగు కూడా ఆశించినట్లు తెలిపారు. ఈ పురుగు నివారణకు క్లోరామిత్రినీప్రోల్ 0.3 ఎంఎల్ లీటర్ నీటిని కలుపుకొని పిచికారి చేసుకోవాలన్నారు. మిరప పంటలో నల్లి ఆశించిందని నివారణకు స్పైరో మెసిఫిన్ 1 మిల్లీ లీటర్, 1 లీటర్ నీటిని కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. మిరపలో వేరుకుళ్లు తెగులు నివారణకు థైయోఫినెట్ మిథైల్ 1 గ్రాము, 1 లీటర్ నీటిలో కలుపుకొని మొక్కల మొదళ్ల దగ్గర బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత



ఆస్పరిలో బేబీ ఫాతీమాకు రూ.10 వేలు నగదును అందజేస్తున్న దృశ్యం

ఆస్పరి: ఆస్పరిలో ఈనెల 25వ తేదీన నజీర్ అహమ్మద్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైనట్లు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు నాయక్ తెలిపారు. మృతుడి భార్య బేబీ ఫాతీమాకు సోమవారం తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలను అందజేశారు. మిగతా సొమ్మును త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప, మహానంది, క్రిష్టారెడ్డి, శివ, తదితరులు ఉన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

కృష్ణగిరి: ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ పెట్టుకు ని ప్రాణాలను రక్షించుకోవాలని ఎస్ఐ సురేష్ సూచించారు. కృష్ణగిరి నుంచి డోన్, వెల్దుర్తిలకు వెళ్లే రహదారిలో సోమవారం సాయంత్రం ఆయన వా హనాల తనిఖీ నిర్వహించి హెల్మెట్ వాడకంపై వా హనాదారులకు సూచనలు చేశారు. హెల్మెట్ ధరించని, వాహన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. తనిఖీల్లో స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో సులభ్ కాంప్లెక్స్

ఆలూరు: స్థానిక పాతబస్టాండ్ సమీపంలో ప్రయాణికుల కోసం రూ.15 లక్షలతో సులభ్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. నిర్మాణ పనులను సోమవారం పత్తికొండ డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు పరిశీలించారు. సర్పంచ్ అరుణాదేవి, వార్డు సభ్యుల సూచన మేరకు పాత భవనం స్థలంలోనే కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. పురుషులకు 5, స్త్రీలకు 5 ఆధునిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

30న భక్త కనకదాసు జయంతి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కురువ భీర లింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఈ నెల 30న భక్త కనకదాసు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కురువ సంఘ నాయకులు కేటీ ఉరుకుంద, ఆంజినేయ, వెంకటరాముడు, భీరప్ప తెలిపారు. సోమ వారం కురువ సంఘం నాయకులతో కలిసి వారు మాట్లాడారు. పట్టణంలో పెద్ద ఎత్తునా ర్యాలీ చేపట్టడం జరుగుతుందని, కురువలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

వెల్దుర్తి(కృష్ణగిరి): ఏపీ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) వెల్దుర్తి మండల నూతన కమిటీ ఎన్నిక సోమవారం స్థానిక బాలుర హైస్కూల్‌లో ఏకగ్రీవంగా జరిగింది. సమాఖ్య జిల్లా ప్రతినిధులు యూఆర్ఏ రవికుమార్, ఎస్ఎం జయరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో నూతన కమిటీ అధ్యక్షుడిగా సురేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా శంకరయ్య గౌడు, ఉపాధ్యక్షులుగా విజయకుమార్, వీఎం ఫ్లోరెన్స్, జిల్లా కౌన్సిలర్లుగా నాగేంద్రయ్య, సరస్వతి, మురళీమోహన్, శ్రీదేవి, సహ కార్యదర్శులుగా కిష్టన్న, శ్రీదేవి, శారద, రంగస్వామి, విజయకుమారి, చిన్న రంగన్న, బాలమద్దిరాజు ఎన్నికయ్యారు.

రెడ్డి జన సంఘం కార్తీక వనభోజనం

హొళగుంద: మండల పరిధిలోని నాగరకణ్వీ గ్రామంలో కార్తీక మాసం సందర్భంగా రెడ్డి జన సంఘం కార్తీక వన భోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండలంలో ఉంటున్న రెడ్డి సామాజిక వర్గం వారి ఆధ్వర్యంలో రావి, వేప చెట్టుకు అశ్వర్థనారాయణ పూజ, ఉసిరి చెట్టు, కులదైవం హేమరెడ్డి మల్లమ్మ చిత్రపటానికి పుష్పార్చన, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలను జరిపారు. అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించి అహ్లాదకర వాతావరణంలో వన భోజనం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్ తెర్నేకల్ సురేంద్రరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కాగా స్థానిక రెడ్డి సంఘం నాయకులు వీరశేనారెడ్డి, సంజీవరెడ్డి, నాగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రామలింగారెడ్డి, ఇంగళదహాల్ ప్రహ్లాదరెడ్డి, అశోక్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం బీజేపీ ఉద్యమం

హాలహర్వి: తుంగభద్ర ప్రాజెక్టు దిగువ కాలువ, ఎగువ కాలువ ఆయకట్టు కింద పంటలకు సాగు నీరు అందించేందుకు బీజేపీ సమరం చేపడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. ఆయన సోమవారం హాలహర్వి మండలంలోని బా పురం గ్రామంలో నిరసన కార్యక్రమం ప్రారంభించా రు. కష్టజీవులపై కనికరం చూపని కర్ణాటక, రాష్ట్ర పాలకుల కళ్లు తెరిపించే దాకా బీజేపీ ఉద్యమం ఆగదన్నా రు. జనవరి ఆఖరి వరకు కాలువలకు నీరు ఇవ్వకపోతే జలదీక్ష పేరుతో రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. బాపురం వద్ద జలదీక్ష చేపట్టనున్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దీక్షలో పాల్గొంటారని తెలిపారు. ఆ పార్టీ నాయకులు ఈరన్న, వెంకటరాముడు, అంబన్న, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు

మద్దికెర: ప్రభుత్వం మద్దికెర మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించడంతో మండలంలోని పంటలు సాగు చేసిన నష్టపోయిన రైతుల జాబితా రూపొందించినట్లు ఏఓ రవి తెలిపారు. ఆయా గ్రామాలలో ఖరీఫ్ సీజన్‌లో 5,891 హెక్టార్లలో పంటలు సాగుచేసి నష్టపోయిన 6,993 మంది రైతులకు రూ.7.17 కోట్లు పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలతో జాబితా తయారుచేసి పంపినట్లు వెల్లడించారు

వరుస చోరీలతో బెంబేలు

ఆలూరు రూరల్: వరుస చోరీలతో ఆలూరు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గత శనివారం ఆలూరు మె యిన్ బజారులో దొంగలు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. అలాగే మెయిన్ బజార్‌లో నివాసం ఉంటున్న బట్టల వ్యాపారి హా న్నూర్ వలి ఇంట్లో దొంగలు పడ్డారు. ఆ కుటుంబసభ్యులు శనివారం బంధువుల ఇంట్లో శుభకార్యానికి వేరే ఊరికి వెళ్లడంతో చోరీ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబసభ్యులు సోమవారం ఉదయం తిరిగి ఇంటికి రాగా.. దుండగులు తాళాలు పగులగొట్టి 12 తులాల బంగారు నగలు, 70 తులాల వెండి, రూ.40 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడు హొన్నూర్ వలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.